కోలాహలంగా మద్యం షాపుల లాటరీ

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో షాపుల కేటాయింపునకు సోమవారం లాటరీ నిర్వహించిన సందర్భంగా భీమవరంలో కోలాహలం నెలకొంది. జిల్లాలోని ఆరు ఎక్సైజ్ స్టేషన్స్ పరిధిలోని 175 మద్యం షాపులకు పట్టణ శివారులోని నిర్మలాదేవి ఫంక్షన్‌హాల్లో ఉదయం 8 గంటల నుంచి లాటరీ నిర్వహించనున్నట్లు ముందుగానే ప్రకటించడంతో జిల్లా నలుమూల నుంచి మద్యం సిండికేట్‌దారులు అనేక మంది ఆదివారం రాత్రికే భీమవరం చేరుకుని వివిధ హోటల్స్‌లో బస చేశారు. 175 షాపులకు 5,627 దరఖాస్తులు రావడంతో లాటరీ కార్యక్రమానికి దరఖాస్తుదారులతోపాటు మరొక 3 వేలకు పైగా వస్తారని అధికారులు అంచనా వేశారు. దీనికి అనుగుణంగానే నిర్మలాదేవి ఫంక్షన్ హాల్ వద్ద ఎక్సైజ్‌శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకే ఫంక్షన్‌హాల్‌కు చేరుకోవాలని చెప్పడంతో వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఉండి, భీమవరం ఎక్సైజ్‌స్టేషన్స్ పరిధిలోవారు మినహా మిగిలిన పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు స్టేషన్స్ పరిధిలోని అనేక మంది దరఖాస్తుదారులు ఆదివారం రాత్రికే చేరుకున్నారు. లాటరీ నిర్వహించే ఫంక్షన్‌హాల్ వద్ద ముందుగానే దరఖాస్తులదారులను గుర్తించి లోపలికి అనుమతించేవిధంగా చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే అనుమతించారు.


భీమవరంలో మద్యం షాపుల లాటరీ నిర్వహణ కేంద్రం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు


భీమవరంలో మద్యం షాపుల లాటరీ నిర్వహణ కేంద్రానికి వచ్చిన మహిళలు

● ఫంక్షన్ హాల్ వద్దనే భోజనం అమ్మకాలు

లాటరీలో పాల్గొనడానికి పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు వస్తారని ముందుగానే గుర్తించడంతో కొంతమంది వ్యాపారులు ఫంక్షన్‌హాల్ వద్దనే అల్పాహారం, టీ, కాఫీ, భోజనం విక్రయకేంద్రాలు ఏర్పాటుచేసి జోరుగా విక్రయాలు చేశారు. ఫంక్షన్‌హాలు పట్టణానికి సుమారు 4 కిలో మీటర్ల దూరంలో ఉండడంతో తినుబండారాలు, కాఫీ, టిఫెన్లు, భోజనం కోసం పట్టణంలోనికి వస్తే ఎక్కువ సమయంలో పడుతుందని భావించి అక్కడే భోజనాలు కొనుగోలు చేశారు.

● మేము సైతమంటూ మహిళలు

మద్యం షాపుల లాటరీకి మహిళలకు సైతం హాజరై ఆశ్చర్యపర్చారు. జిల్లాలో ఇటీవల సంక్రాంతి కోడి పందాలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో మహిళలు సైతం హాజరవుతుంటే మద్యం షాపుల లాటరీకి మేం సైతమంటూ కొంతమంది మహిళలు రావడం విశేషం. లాటరీ నిర్వహించే ఫంక్షన్‌హాల్లో ముందు వరుసలోనే కూర్చునే లాటరీ విధానాన్ని తిలకించారు. వీరిలో కొంతమంది పేరున షాపులకు దరఖాస్తులు కూడా చేసుకున్నారు.

● ప్రశాంతంగా లాటరీ నిర్వహణ

175 షాపులకు లాటరీ నిర్వహించగా ముందుగా ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు నగరపంచాయతీ షాపులకు లాటరీని ఉదయం 8 గంటలకే కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించగా మధ్యాహ్నం రెండు గంటలకు మొత్తం లాటరీ నిర్వహణ పూర్తి అయింది. ఈ కార్యక్రమంలో జేపీటి రాహుల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ వి భీమారావు, ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమీషనర్ కె ప్రభుకుమార్, ఎక్సైజ్ సూపర్నిండెంట్ ఆర్ఎస్ కుమారేశ్వరన్, డిపోమేనేజర్ రంగారెడ్డి, భీమవరం, తాడేపల్లిగూడెం ఆర్డీవోలు కె ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వై భవానీశంకరి, భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హాస్టళ్ల సందర్శన


ఎస్సీ బాలికల హాస్టల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి అప్పలస్వామి

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం సివిల్ జడ్జి బి అప్పలస్వామి సోమవారం భీమవరం పట్టణం జువ్వలపాలెం రోడ్డులో నేత్ర వైద్యుడు యువీ రమణరాజు నిర్వహిస్తున్న అంధుల పాఠశాల, రైతు బజార్ దగ్గరలోని ప్రభుత్వ బాలికల హాస్టల్, ప్రభుత్వ కాలేజీ, ఎస్సీ బాలికల హాస్టల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులు, సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె జ్యోతి, ఎంబీ భవాని, వార్డెన్లు కె భీమేశ్వరి, జి శ్యామల, సీహెచ్ భానుమతి, వై పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రెండెడ్ల బండిపై అమ్మవారి ఊరేగింపు


వినూత్న రీతిలో రెండెడ్ల బండిపై దుర్గమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక శ్రీనగర్ కాలనీలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి అమ్మవారిని రెండెడ్ల బండిపై వినూత్న రీతిలో ఊరేగించారు. పుర వీధుల గుండా అమ్మవారిని ఊరేగించి, అర్ధ రాత్రి సమయంలో వెంకయ్య వయ్యేరు పంట కాలువలో నిమజ్జనం చేశారు. మండలంలోని చినకాపవరం శివారు మహాలక్ష్మీపురంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి లడ్డూ వేలం నిర్వహించారు. వేలంలో రూ. 1,11,000లకు లడ్డూను గ్రామానికి చెందిన సరిపల్లి నరేష్ దక్కించుకున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో అమ్మవారి లడ్డూ రూ.2 లక్షలకు పైగా వేలం జరిగింది.

నూతన వస్త్రాల బహూకరణ


పాస్టర్స్‌కు నూతన వస్త్రాలు అందజేస్తున్న యూపీఎఫ్ నాయకులు

ఉండి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యూపీఎఫ్) మండల కమిటీ ఆధ్వర్యంలో సభ్యులైన పాస్టర్లకు నూతన వస్త్రాలను బహూకరించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా సభ్యులైన పాస్టర్లకు నూతన కమిటీ అధ్యక్షుడు పాస్టర్ సోడదాసి పీటర్, కార్యదర్శి వై.యోనాతాను, కోశాధికారి జయరాజు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ రెవరెండ్ ఈలి డేవిడ్‌మార్క్, మాజీ అధ్యక్షుడు చంద్రబాబు, తదితరులు పాస్టర్ల ఇంటింటికీ వెళ్లి వస్త్రాలను అందించారు. కార్యక్రమంలో పలువురు యూపీఎఫ్ పాస్టర్లు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్‌లో రూ.10 నాణేలపై అవగాహన


యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.10 నాణేలు అందిస్తున్న దృశ్యం

భీమవరం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం రీజనల్ కార్యాలయంలో సోమవారం రూ. 10 నాణేలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డిప్యూటీ రీజనల్ హెడ్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్‌బీఐ ఆదేశాలతో రూ.10 నాణేలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఈనెల 14, 15 తేదిల్లో అన్ని యూనియన్‌బ్యాంక్ శాఖలకు రూ. 10 నాణేలు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం నాగేంద్రప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం

నరసాపురం: పట్టణంలో సోమవారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దపదపాలుగా పడిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగి పొర్లాయి. దీంతో పట్టణంలో ప్రధాన సెంటర్‌లో మోకాలు లోతు నీరు చేరింది. బస్టాండ్, స్టీమర్ రోడ్డు, ప్రకాశం రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందికి లోనయ్యారు.

ఆత్మహత్యా యత్నం

పాలకోడేరు: మండలంలోని పెన్నాడపాలెం గ్రామానికి చెందిన ఆరేపల్లి వెంకటేశ్వరరావు తన సరిహద్దు గొడవ ఉన్న స్థలంలో బుర్రా రమేష్, బుర్రా చంద్రావు, బుర్ర ప్రసన్న అను వారు సిమెంట్ పోలు తీసి వేశారు. బాధితుడు వెంకటేశ్వరరావు ఎందుకు తీస్తున్నారని అడిగినందుకు ఈ స్థలంలోకి వస్తే చంపేస్తామని బెదిరించారు. దీంతో వెంకటేశ్వరరావు మనస్థాపం చెంది పురుగుల మందు తాగి గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు మేరకు పాలకోడేరు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

వీరవాసరం: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తెలిపారు. వీరవాసరం మండలంలోని కొణితివాడ, ఉత్తర పాలెం, నవుదూరు గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రోడ్లకు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. కొణితివాడకు రూ.19 లక్షలు, నౌదూరు రూ.30 లక్షల, ఉత్తరపాలెం రూ.10 లక్షలు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జెడ్పీటీసీ గుండా జైప్రకాష్ నాయుడు, బిసెట్టి లక్ష్మి, కోడి వరలక్ష్మి, యరక రాజు చినబాబు, యరక రాజు హరిబాబు, డి ఈ స్వామి నాయుడు ఎండిఓ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు


రాయకుదురులో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం


అమ్మవారి గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత గ్రంధి రవితేజ

వీరవాసరం: శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని వీరవాసరం మండలంలో సోమవారం అత్యంత వైభవోపేతంగా ఊరేగింపులు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు పూజలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. వీరవాసరంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం, తోలేరులోని శ్రీ ప్రసన్న కనక దుర్గాదేవి ఆలయం, రాయకుదురు, మడుగు పోలవరం, నవుదూరు, అండలూరు, తోకలపూడి, మత్స్యపురి, నందమూరి గరువు, చింతల కోటి గరువు, పెరికిపాలెం, దూషన పూడి, మత్స్యపురి పాలెం తదితర గ్రామాల్లో శ్రీ అమ్మవార్ల నవరాత్రి మహోత్సవాలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు అమ్మవార్ల ఆలయంలో దర్శనాలు చేసుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి దేవి దేవస్థానంలోని దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారి గ్రామోత్సవాన్ని గ్రంధి రవితేజ ప్రారంభించారు. ముందుగా వేద మంత్రాలతో సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో అర్చకులు మహిళ భక్తులచే కుంకుమ పూజలును నిర్వహించారు. అనంతరం గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ప్రత్యేకంగా అలంకరణ చేసిన వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో భోగిరెడ్డి హనుమాన్, సమతం తాతాజీ, మద్దాల సత్యనారాయణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండో విడత గ్రామ సభలు

ఉండి: గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపునకు అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మొదటి విడత గ్రామ సభలు పూర్తి కావడంతో రెండో దపా గ్రామ సభలను 15వ తేదీ మంగళవారం ప్రారంభిస్తున్నట్లు అడిషనల్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ (ఏపీఓ) లంకపల్లి ఓమేగారాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఆరేడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, మధ్యాహ్నం 2 గంటల నుంచి కలిగొట్ల గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామసభల్లో ప్రభుత్వం కొత్తగా గుర్తించిన పనులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటి అంచనాలు తయారు చేస్తామన్నారు. రైతులు పశువుల, గొర్రెల షెడ్లు నిర్మాణం, పండ్ల తోటల పెంపకంపై ప్రాధాన్యత ఇస్తామన్నారు. అలాగే మండల వ్యాప్తంగా గ్రామసభలు ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

దివ్యాంగులను ఆదరించాలి


భవిత సెంటర్‌లో అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులను ఆదరించాలని, ప్రతి పాఠశాలలోను అభ్యసన సమస్యలు కలిగిన పిల్లలు సుమారు 20 శాతం మంది ఉన్నారని, పాఠశాల ఉపాధ్యాయులు పిల్లల లోపాన్ని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రత్యేక ఉపాధ్యాయులు కట్టా సరేష్ కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల కేంద్రంలో సోమవారం దివ్యాంగుల పిల్లలు, అభ్యసన సమస్యలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భవిత సెంటర్ నిర్వాహకులు ఎస్‌కే బాలఈశ్వరయ్య మాట్లాడుతూ చదవడం, రాయడం, భాషను వ్యక్తం చేయడం, లెక్కలు తదితర సమస్యలు కలిగి ఉంటారని, చిన్న వయస్సులోనే ఆయా సమస్యలను గుర్తించి వారికి మంచి శిక్షణ అందిస్తే రాణిస్తారని తెలిపారు. భవిత సెంటర్‌లో లోపాలు కలిగిన పిల్లలు, వారికి అందుతున్న సంక్షేమాలు, అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి మాట్లాడారు. ఎం.చంద్రకుమారి, కె.కుమారి, అంగన్‌వాడీ టీచర్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మునిసిపల్ క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


భీమవరం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: మునిసిపాల్టీలో పనిచేసే క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గం సభ్యుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. క్లాప్ డ్రైవర్స్ సమస్యలను పరిష్కరించాలని సోమవారం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పర్చాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్స్‌కు కనీస వేతనం రూ 18,500 ఇవ్వాలని, క్లీన్ అండ్ గ్రీన్ వాహనాల మరమ్మతులను ప్రభుత్వమే భరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిల్లారి మల్లేశ్వరావు, రాజు, శివ, ఆర్ రమణ, దైవరాజు, బి శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే గ్రంధి జన్మదిన వేడుకలు


ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. భీమవరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కోడే వీరమ్మ సేవా సమితి అధ్యక్షుడు కోడే యుగంధర్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ప్రభుత్వాసుపత్రిలో పాలు, రొట్టేలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవస్థానంలో అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట భోగయ్య, తిరుమాణి ఏడుకొండలు, అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు భోజనం పంపిణీ

భీమవరం: ప్రభుత్వ మాజీ విప్, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం భీమవరం పట్టణం 29వ వార్డులో గ్రంధి శ్రీనివాస్ సేవాసమితి ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ గంటా అనితారాణి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర కుమార్ జి రాజ్‌కుమార్, పట్టెం శుభాకర్, కె కల్యాణ్, జి రాహుల్, పి కేశవ తదితరులు పాల్గొన్నారు. అలాగే దివ్యాంగులకు నూతన వస్త్రాలు, భోజనాలు పంపిణీ చేశారు.వ్యాపార వేత్త ఆలపాటి తులసీ వెంకటరమణ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాన్ని బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట బోగయ్య చేతులు మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలపాటి తులసీవెంకటరమణ, యర్రంశెట్టి మురళీ, చెరుకువాడ రంగసాయి, పులపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కాళ్ల: ప్రభుత్వం, దాతల సహకారంతో రానున్న సంక్రాంతి నాటికి ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా కాళ్ల మండలం జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ సహకారంతో మట్టిరోడ్డు లేకుండా సీసీ రోడ్లు నిర్మించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశానన్నారు. గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, నాయకులు కఠారి వెంకట నరసింహరాజు, కోరా రామ్మూర్తి, ముదుండి రాజేష్, పెన్మెత్స సత్యనారాయణరాజు, మంతెన కోదండరామరాజు, ఎంపీడీవో జి.స్వాతి, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ టి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరాలు అభినందనీయం


భీమవరంలో కంటివైద్యశిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం: కంటి సమస్యలతో బాధపడుతున్నవారికి ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సోమవారం భీమవరం బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి సహకారంతో శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి, గన్నాబత్తుల తులసమ్మ పెదతాత కల్యాణ మండపం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు కాగిత వీర మహంకాళీరావు, మెంటే పార్థసారధి మాట్లాడూతూ కంటి సమస్యలతో బాధపడుతున్నవారికీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా పథకంలో శస్త్రచికిత్సలు చేయించి కళ్లజోళ్ల అందజేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 200 మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో రామాయణం రమేష్ బాబు, కె శ్రీరాములు, నల్లం వీరస్వామి, చెరుకువాడ రంగసాయి, సమతం సత్యనారయణ, బండి సత్యనారాయణ, కారుమూరి సత్యనారాయణమూర్తి, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొంగుతున్న డ్రెయిన్

నరసాపురం: పట్టణంలోని రాయిపేటలో డీసీసీబీ బ్యాంకు రోడ్డులో ఉన్న డ్రెయిన్ మురుగు పారడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. అటుగా వెళ్లేవారు ఇబ్బందులుపడుతున్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు డ్రెయిన్స్‌లో పూడికతీత పనులు చేపట్టారు. అయితే ఈ పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి.

ప్రభుత్వ భవనాల ప్రారంభమెప్పుడో ?

అసాంఘిక కార్యకలాపాలకు నెలవు

ఆకివీడు: గత కొన్నేళ్లుగా నిర్మాణం ఆగిపోయి అసంపూర్తిగా ఉన్న బాలసదన్ భవనం, నిర్మాణం పూర్తి చేసుకున్న స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. మండలంలోని పెదకాపవరం శివారు కొల్లేరు రోడ్డులో నిర్మించిన బాల సదన్ నిర్మాణం పూర్తయ్యి, కొద్దిపాటి పని మాత్రమే ఉంది. గత కొన్నేళ్లుగా భవన నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో భవనంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా నిర్మించిన భవనం చుట్టూ పిచ్చి మొక్కలు విపరీతంగా మొలిచాయి. ఈ భవనాన్ని ఏ విధంగానూ ఉపయోగించుకోవడం లేదు. సాంఘిక సంక్షేమ శాఖ నిధులతో ఆ శాఖ అధికారుల పర్యవేక్షణలో భవన నిర్మాణం చేశారు. నేటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. అదే విధంగా ఇటీవల నిర్మాణం పూర్తి చేసుకున్న స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం అదనపు భవనం నేటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. సామాజిక ఆరోగ్య కేంద్రం అదనపు భవనం ప్రారంభిస్తే సీహెచ్‌సీలో మరిన్ని సేవలు పెరిగే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.


పెదకాపవరంలో అసపూర్తిగా నిలిచిపోయిన బాలసదన్ భవనం


ప్రారంభోత్సవానికి నోచుకోని రెండో సీహెచ్‌సీ భవనం

పోస్టుమార్టం ప్రారంభమెప్పుడు?

స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం పనులు చేపట్టాలని రెండేళ్ల క్రితమే ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినప్పటికీ నేటికీ సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించడం లేదు. దీనికోసం ప్రత్యేక షెడ్డు నిర్మించాల్సి ఉంది. షెడ్డు నిర్మాణంలో జాప్యం వలన ఇక్కడ పోస్టుమార్టాలు నిర్వహించడం లేదు. దీంతో మృతదేహాలను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాల్సి వస్తుంది.

త్వరలోనే ప్రారంభిస్తాం

స్థానిక సీహెచ్‌సీ వద్ద అదనపు భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని డీసీహెచ్ఎస్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ చెప్పారు. భవనం చుట్టూ మట్టి పూడిక పనులు చేపట్టాల్సి ఉందన్నారు. పోస్టుమార్టం షెడ్ల నిర్మాణానికి 16వ ఆర్థిక సంఘ నిధుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ భవనంలో సేవలందించేందుకు త్వరలోనే చర్యలు చేపడతామని వైద్యాధికారి వెంకటపతిరాజు చెప్పారు. భవనం లోపల సెల్ఫ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ